పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# భూ యాజమాన్య వ్యవస్థలో సరికొత్త మైలురాయి..జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు..




విజయవాడ, పెన్ పవర్,మే, 09, దేశానికే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం భూ యాజమాన్య వ్యవస్థను మరింత పారదర్శకంగా, రైతుల శ్రేయస్సు లక్ష్యంగా తీర్చిదిద్దుతోందని.. అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానం అనుసంధానంతో పట్టాదారు పుస్తకాలను రాజముద్రతో అందిస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం ఎ.కొండూరు మండలం, మాధవరంలో జరిగిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు.. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. 702 మంది స్థానిక లబ్ధిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భూమి అంటే కుటుంబానికి ఉద్వేగాలతో ముడిపడిన అంశమని.. ఈ నేపథ్యంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు సరికొత్త పట్టాదారు పుస్తకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో సర్వే జరగ్గా.. శాటిలైట్ టెక్నాలజీ, జియో కోడ్స్ అనుసంధానంతో రాజముద్రతో సరికొత్త పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. భద్రతా ఫీచర్లతో ఈ పుస్తకాలు రూపొందించినట్లు తెలిపారు. భూ సంబంధ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, గ్రామాలను భూ వివాద రహితంగా మార్చేందుకు ఈ పాసుపుస్తకాలు దోహదం చేస్తాయని.. హద్దులను మార్చేయడం వంటి మోసాలు కుదరవని స్పష్టం చేశారు. అత్యంత కచ్చితత్వంతో మన భూములు, మన హద్దులు భద్రంగా ఉంటాయని వివరించారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా భూమికి సంబంధించిన వివరాలను కంప్యూటర్‌లో, మొబైల్‌లో చూసుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

అన్నదాతలు లక్షాధికారులు కావాలి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

రైతులు లాభదాయకమైన పంటలు సాగుచేసి.. వ్యవసాయంతో పాటు పాడికి ప్రాధాన్యమిస్తూ ముందుకెళ్లాలని, అన్నదాతలు లక్షాధికారులు కావాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఉద్యానపంటలు సాగుదిశగా వెళ్తూ ప్రకృతి సేద్య విధానాలను అవలంబించాలన్నారు. ఎ.కొండూరు ప్రాంతాన్ని అగ్రి, హార్టీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. నాలుగు మండలాల పరిధిలోని చాలా ప్రైవేటు భూములు 22ఏలో ఉన్నాయని.. ఈ భూములను 22ఏ నుంచి తొలగించి యజమానులకు భూహక్కులు కల్పించాలని కోరారు. అన్ని వర్గాల్లోని పేదలకు వీలైనంత త్వరగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ప్రతి తండాలో సిమెంటు రోడ్లు ఉండేలా చేయడంలో తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. ప్రస్తుతం అందిస్తున్న పట్టదారు పాసుపుస్తకాలు సెక్యూరిటీ ఫీచర్లతో ఉన్నాయని.. యజమానులకు పూర్తిస్థాయిలో భూ భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. ఇంటింటికీ కృష్ణాజలాలు అందించే కార్యక్రమాన్ని ఎ.కొండూరులో ప్రాంతంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించేలా కృషిచేయనున్నట్లు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో తిరువూరు ఆర్‌డీవో ఎ.కుమార్, తహసీల్దార్ ఎం.ఉదయ భాస్కర రావు, ఎంపీడీవో బొజ్జగాని శ్రీనివాసరావు, వివిధ శాఖలకు చెందిన అధికారులతో పాటు రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, డివిజనల్ విజిలెన్స్ కమిటీ సభ్యులు వాసు తదితరులు పాల్గొన్నారు...

# ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మొబైల్ వెహికల్‌ను సందర్శించిన హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత..




విజయవాడ, పెన్ పవర్, మే, 09, ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న ఉత్పత్తులను విక్రయించేందుకు విజయవాడలోని ఎస్ఎల్‌వీ గ్రీన్ విల్లాస్‌లోప్రారంభించిన మొబైల్ వెహికల్‌ను రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆహార స్వయంసమృద్ధి సాధనలో ప్రకృతి వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పరిమిత వనరులతోనే ఇతర దేశాలు మిద్దె తోటల ద్వారా గణనీయమైన దిగుబడులు సాధిస్తున్నాయని, మన రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను సమర్థంగా వినియోగిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విజయవాడ వంటి పట్టణ ప్రాంతాల్లో నైట్ ఫుడ్ కోర్టుల ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రతిపాదనను మంత్రి ప్రస్తావించారు. ఇటువంటి వినూత్న కార్యక్రమాల ద్వారా రైతులకు భరోసా కలగడమే కాకుండా, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించిన మంత్రి, ప్రతి ఒక్కరూ సహజ సాగు వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఇటువంటి సానుకూల మార్పులు రాష్ట్ర ప్రగతికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.నాగప్రమీల రాణి, ప్రకృతి వ్యవసాయ రైతులు, అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు...

# స్వయం ఉపాధి దిశగా మహిళలకు ప్రత్యేక శిక్షణలు...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..




విజయవాడ, పెన్ పవర్, మే, 09, స్వయం సహాయక సంఘాల మహిళలు రైజ్ కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గొల్లపూడిలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళలకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా పుట్టగొడుగుల పెంపకం. డిజైనింగ్ వస్త్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పాల్గొని మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. పుట్టగొడుగుల పెంపకం తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం అందించే ఉత్తమ స్వయం ఉపాధి అవకాశమని తెలిపారు. గ్రామీణ మహిళలు ఇంటి వద్ద నుంచే ఈ సాగును చేపట్టి ఆర్థికంగా స్వావలంబన సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆరోగ్యకర ఆహారంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో పుట్టగొడుగులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలు సంప్రదాయ ఉపాధి మార్గాలతో పాటు ఆధునిక వ్యవసాయ ఆధారిత ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణలు, మార్గదర్శకత్వాన్ని వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు.

ఈ సందర్భంగా ఆంత్రప్రెన్యూర్ నాగరాజు మహిళలకు పుట్టగొడుగుల పెంపక విధానం, అవసరమైన ముడి పదార్థాలు, నిర్వహణ పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. తక్కువ స్థలంలో కూడా పుట్టగొడుగుల సాగు చేయవచ్చని, దీని ద్వారా నెలకు మంచి ఆదాయం పొందే అవకాశముందని వివరించారు. శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా లలిత్ ప్రింట్ సంస్థకు చెందిన హైమావతి.. డిజైనింగ్ వస్త్రాలపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు...

# కుంచనపల్లిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్ (గుంటూరు) : పెన్ పవర్, మే, 09. డ్రైన్లు నిర్మాణం లేక, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో పరిసరాలలో వాడిన వ్యర్థపు నీరు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున రోడ్లపైకి వచ్చి చేరి దుర్గంధం వెదజల్లుతుందని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అన్నారు. శనివారం గ్రామంలోని పలు రహదారులను ఆయన పరిశీలించారు. గ్రామపంచాయతీ గా ఉన్నప్పుడు పంచాయతీ అధికారులు డ్రైనేజీ వ్యవస్థ పై దృష్టి పెట్టి మురుగు బయటకు పంపేందుకు చర్యలు తీసుకునే వారిని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ లో గ్రామాలు విలీనం అయిన తరువాత కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని ఆయన విమర్శించారు. రోజుల తరబడి మురుగునీరు రోడ్లపై నిలవ ఉండడంతో, మురుగు దుర్గంధం వెదజల్లుతూ దోమలు అధికంగా ప్రబలుతున్నాయని అన్నారు. తక్షణమే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రజలు జబ్బుల బారిన పడకుండా మురుగునీరును బయటకు పంపేందుకు డ్రైన్లు నిర్మాణం చేపట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు.

# జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా యువ ఆవిష్కర్తల మేధో ప్రదర్శన..జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ..




విజయవాడ, పెన్ పవర్, మే, 09,ఈ నెల 11న జాతీయ సాంకేతిక దినోత్సవం (నేషనల్ టెక్నాలజీ డే ) సందర్భంగా విజయవాడ, ఎనికేపాడులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)లో స్టార్టప్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలు, వినూత్న ఆలోచనలతో ముందుకు వస్తున్న స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించేందుకు ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విజయవాడ జోన్ పరిధిలోని అన్ని స్టార్టప్‌లు ఈ ఎక్స్‌పోలో పాల్గొనవచ్చని తెలిపారు. స్టార్టప్‌లకు ప్రత్యేక స్టాళ్లతో వారి ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నమూనాలను ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉత్తమ స్టార్టప్‌లకు నగదు బహుమతులు కూడా అందజేయనున్నట్లు వెల్లడించారు. మొదటి బహుమతి -- రూ. 30,000, ద్వితీయ బహుమతి -- రూ. 20,000, మూడో బహుమతి -- రూ. 15,000 ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో ప్రతిభ కనబరుస్తున్న యువత, స్టార్టప్ వ్యవస్థాపకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమం పూర్తి వివరాల కోసం: 9154970454 లో సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు...

# తొలిసారి బాయిల్డ్ రైస్ కొనుగోలకు అనుమతి రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నాం...మంత్రి నాదెండ్ల మనోహర్..




విజయవాడ, పెన్ పవర్, మే, 09, రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగ ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం మొదటి సారి బాయిల్డ్ రైస్ కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. దీని ద్వారా రాష్ట్రంలో వేలాది మంది రైతులకు మేలు జరుగుతుంది అని రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ ఏడాది రబీలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ ను తీసుకుంటామని చెప్పారు. రబీ ధాన్యం సేకరణ క్షేత్రస్థాయిలో జరుగుతున్న తీరును పరిశీలించేందుకు శనివారం ఎన్టీఆర్ జిల్లాలోని రామవరప్పాడు విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యాలయం, గొల్లపూడి ఆర్ఎస్ కే కేంద్రాలను మంత్రివర్యులు సందర్శించారు. అక్కడ ధాన్యం నుంచి తేమ శాతం పరిక్షించే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం రైతులతో మచ్చటించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యం అమ్మిన తర్వాత 30 నిమిషాల నుంచి 17 గంటల వ్యవధి లోనే నగదు తమ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని రైతులు మంత్రి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడే క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలు గుర్తించారు. తేమ శాతం ఎక్కువగా ఉండడం, గోతాలకు రంధ్రలు ఉండడం గుర్తించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో లారీలు, గోతాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యంలో తేమ శాతం తనిఖీ యంత్రాలు పూర్తిగా బ్లుటూత్ తో మాత్రమే వాడాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతులు చెప్పిన సమస్యలు అక్కడే నోట్ చేసుకుని, ముస్తాబాద్, కొండూరు ఆర్ఎస్కే కేంద్రాలకు ఫోన్ చేసి సాయంత్రం లోపు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మీడియాతో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ..

క్షేత్ర స్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పౌరసరఫరాల శాఖ, కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ముందుకు వెళుతుంది. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటున్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేలా యంత్రాంగం పనిచేస్తోంది. దీనిని ఎప్పటికప్పుడు ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందం పనిచేస్తుంది.

ఈ ఏడాది సేకరణ లో రికార్డు.

ఈ ఏడాది ధాన్యం సేకరణలో పౌర సరఫరాల శాఖ కొత్త రికార్డు సృష్టించనుంది. రైతులకు వచ్చిన అధిక దిగుబడులను పౌరసరఫరాల శాఖ ఒక ప్రత్యేక ప్రణాళిక ప్రకారం సేకరించాలని నిర్ణయం తీసుకుంది. ఊహించని విధంగా ఈ ఏడాది 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు రబీలో ప్రణాళిక వేసుకున్నాము. దీనిని కచ్చితంగా పూర్తి చేస్తాం. ఇప్పటికే అన్ని జిల్లాల్లో ధాన్యం సేకరణ వేగవంతం చేసాం. దానికి తగినట్లుగానే ఎప్పటికప్పుడు రైతులకు ధాన్యం అమ్మిన డబ్బులను చెల్లిస్తున్నాం. ఎక్కడ ఏ ఇబ్బంది రాకుండా ముందుకు వెళ్తున్నాం.

కేంద్ర ప్రభుత్వం సహకారంతో కష్టకాలంలో రైతులను ఆదుకోవాలనే తలంపుతో బాయిల్డ్ రైస్ 2 లక్షల మెట్రిక్ టన్నులు ఈ ఏడాది కొనుగోలు చేసేందుకు వెసులుబాటు కల్పించాం.

ఎన్టీఆర్ జిల్లాలో గత ఏడాది 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తే, ఈ సంవత్సరం 80 వేల మెట్రిక్ టన్నుల సేకరణ ఇప్పటికే పూర్తి అయ్యింది. 60 శాతం పైగా అదనంగా తీసుకున్నాము.

ఈ రబీ సీజన్లో ఇప్పటివరకు రూ.4,410 కోట్ల ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లో వేసాం. 94 శాతం నగదు 24 గంటల లోపు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ఘనత మా కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది.

గోతాల సమస్య, లారీల విషయంలో సమస్యలు మా దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నాం. ఇప్పటి వరకు 17.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. దీన్ని మరింత వేగవంతం చేస్తాం.

ఇతర జిల్లాల నుంచి మిల్లర్లు వచ్చి ధాన్యం సేకరణ చేస్తే బాగుంటుందని రైతులు కోరారు. పరిశీలన చేసి సోమవారం నాటికి నిర్ణయం తీసుకుంటాం అన్నారు. కార్యక్రమం లో పౌరసరఫరాల సంస్థ ఎండి ఢిల్లీరావు , ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లాకు రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు



నరసరావుపేట, పెన్ పవర్ మే 09: పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పరిపాలనలో మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫైల్ క్లియరెన్స్‌లో ఆమె రెండో ర్యాంకును సాధించడం విశేషంగా నిలిచింది. మార్చి 11 నుండి మే 5 వరకు జరిగిన పనితీరు విశ్లేషణలో, ఒక ఫైల్‌ను క్లియర్ చేయడానికి సగటున 7.65 గంటల సమయం తీసుకుని ఆమె ఈ స్థానం దక్కించుకున్నారు. ఇదే సమయంలో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా 4.59 గంటల సగటుతో మొదటి స్థానాన్ని సాధించారు. భార్యాభర్తలైన ఈ ఇద్దరు ఐఏఎస్ అధికారులు పరిపాలనలో తమదైన ముద్ర వేస్తూ, వేగవంతమైన నిర్ణయాలు మరియు పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకైన చర్యలు తీసుకోవడం, వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ద్వారా మంచి పాలనకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. ఫైల్ క్లియరెన్స్‌లో టాప్ స్థానాలు సాధించడం ద్వారా సమర్థవంతమైన పరిపాలనకు నిదర్శనంగా నిలిచిన ఈ ఇద్దరు కలెక్టర్లకు ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# గెలుపులో కీలకపాత్ర పోషించినందుకే.. అభివృద్ధి, సంక్షేమ కానుకలు : ప్రత్తిపాటి

ఏపీ ప్రజలు గుజరాత్ ను ఆదర్శంగా తీసుకోవాలి.

నాదెండ్ల మండల కేంద్రంలోని శ్రీ గోవర్ధన స్వామి చెరువు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.

వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, సోలార్ లైటింగ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే శ్రీకారం.





చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే 09 : నాదెండ్ల : తెలుగుదేశం గెలుపులో కీలక పాత్ర పోషిస్తున్న నాదెండ్ల గ్రామానికి ఎంత అభివృద్ధి, సంక్షేమం బహుమతిగా ఇచ్చినా ప్రజల రుణం తీరదని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన నాదెండ్ల మండల కేంద్రంలో రూ.50 లక్షలతో చేపట్టిన శ్రీ గోవర్ధన స్వామి చెరువు ఆధునికీకరణ పనులకు గ్రామస్తులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్తిపాటి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. స్థానిక చెరువును బాగుచేయడంతో నీటి సంరక్షణతో పాటు.. వృద్ధులు చిన్నారులకు ఉపయోగపడేలా వాకింగ్ ట్రాక్, పిల్లల పార్క్ ల అందుబాటులోకి వస్తాయన్నారు.

గ్రామ నాయకత్వం సమన్వయం.. సహకారంతో పనిచేస్తే కూటమికి ఎదురుండదు

నాదెండ్ల టీడీపీ కంచుకోటని, ప్రజలకు ఎంత మంచి చేస్తే అంతగా ఆదరిస్తారని చెప్పడానికి ప్రత్యక్ష నిదర్శమని ప్రత్తిపాటి చెప్పారు. 2014-19లో 4వేల కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి చేసినా ప్రజలు టీడీపీని కాదని, వైసీపీని గెలిపించి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఏపీ ప్రజలు కూడా గుజరాత్ ను ఆదర్శంగా తీసుకోవాలని, ఒకే ప్రభుత్వం సుదీర్ఘకాలంలో అధికారం ఉండబట్టే.. ఆ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రజలకోసం పనిచేసే నాయకత్వాన్ని కాదనుకుని ఎంత నష్టపోయామో, గత ఐదేళ్లలో చూశామన్నారు. గ్రామనాయకత్వం సమన్వయం... సహకారంతో ఏకతాటిపై నిలిస్తే,. కూటమి ప్రభుత్వానికి ఏ ఎన్నికలోనూ ఎదురే ఉండదన్నారు. ఈర్ష్యాద్వేషాలు, వ్యక్తిగత అభిప్రాయాలు, ఆలోచనలు పక్కనపెట్టి, ప్రజలు..రాష్ట్రం కోసం ఆలోచించడమే నిజమైన నాయకుడికి ఉండే గొప్ప లక్షణమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, సొసైటీ చైర్మన్ నల్లమోతు హరిబాబు, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ రైతు అధ్యక్షులు సూర్యనారాయణ, టీడీపీ నాయకులు వేములపల్లి బసవయ్య, నెల్లూరి పూర్ణయ్య, శ్రీనివాస రెడ్డి, ఈదార సాంబయ్య, టారిష్, ఏ.పి.ఓ రామారావు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో శ్రీ గణేష్ మ్యాచింగ్ సెంటర్ ప్రారంభం

## ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట, పెన్ పవర్ మే 09: నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఎంజీసీ మార్కెట్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ గణేష్ మ్యాచింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయులు ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు రిబ్బన్ కట్ చేసి మ్యాచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపార సంస్థల అభివృద్ధి స్థానిక ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతుందని, నూతన వ్యాపారవేత్తలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంజీసీ మార్కెట్ ప్రాంగణంలో వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ చలివేంద్రాన్ని కూడా ఎమ్మెల్యే అరవింద బాబు ప్రారంభించారు. వేసవిలో బాటసారులు, వ్యాపారులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు, వ్యాపార ప్రముఖులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నరసరావుపేటలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర స్పెషల్ డ్రైవ్

## వరుసగా ఐదవ రోజు పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

## మ్మెల్యేని సన్మానించిన స్థానికులు







నరసరావుపేట, పెన్ పవర్ మే 09: స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శనివారం వరుసగా ఐదో రోజు పట్టణంలోని 1వ వార్డు సాయినగర్ ప్రాంతంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటరీ సిబ్బందితో పాటు ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రోడ్లు, సైడ్ కాల్వలు, డ్రైన్లను పూర్తిస్థాయిలో శుభ్రం చేశారు. చిన్నారులు, మహిళలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానికులు, మహిళలు, చిన్నారులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత నారా లోకేష్ బాబు నేతృత్వంలో గడిచిన రెండేళ్లుగా రాష్ట్రంలో మంచి పాలన సాగుతోందన్నారు. ప్రతి ఎమ్మెల్యే ప్రజల్లో ఉండాలని, వారి సమస్యలు తీర్చాలని సీఎం పిలుపునిచ్చారు. ఆ స్ఫూర్తితోనే నేను నిత్యం ప్రజలతో ఉంటూ పనిచేస్తున్నానని తెలిపారు. కాలనీల్లో కాల్వల మరమ్మతులు, శానిటరీ పనులు, రోడ్ల శుభ్రత, తాగునీటి సరఫరా, నల్లా కనెక్షన్లు వంటి అన్ని పనులను బాధ్యతగా చేపడుతున్నాం. సాయిరామ్ సిటీ, సాయి టౌన్‌షిప్‌లో శానిటరీ పనులు కొనసాగుతున్నాయి. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సహకారంతో ఈ కార్యక్రమాలు విజయవంతమవుతున్నాయని వివరించారు. ఈ ప్రాంతంలో దాదాపు 25 ఏళ్లుగా ఎవరూ శానిటరీ పనులు చేపట్టలేదు. గడిచిన ఐదు రోజులుగా నిర్విరామంగా పనిచేసి సాయిరామ్ సిటీని పూర్తిగా శుభ్రం చేశాం. స్థానిక మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాయి టౌన్‌షిప్‌లో తీవ్ర నీటి ఎద్దడి ఉంది. అమృత్-2 పథకం ద్వారా రానున్న రెండు నెలల్లో ప్రతి ఇంటికీ తాగునీటి నల్లా బిగిస్తామని హామీ ఇచ్చారు. ఒక్కో ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని నాలుగైదు రోజుల పాటు పూర్తిస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించి, అనంతరం తదుపరి వార్డుకు వెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. తదుపరి చంద్రబాబు నాయుడు కాలనీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఉమ్మడి కూటమి కార్యకర్తలు, నాయకులు ఏ పని చెప్పినా వెనకాడకుండా ముందుకొస్తారు. రోడ్డు శుభ్రం చేయాలన్నా, కాల్వల పూడిక తీయాలన్నా సంతోషంగా పాల్గొంటారు. తెలుగుదేశం పార్టీ సభ్యుడిగా ఉన్నందుకు గర్వంగా ఉందని అన్నారు. స్థానిక మహిళలు మాట్లాడుతూ సేవాభావం, ప్రతిరోజు ప్రజలతో ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న ఎమ్మెల్యే ని అభినందించారు.

# లక్ష్మీపురం మేజర్ డ్రైన్ నిర్మాణ పనుల పూర్తికి 4 రోజులే తుది గడువు...కమిషనర్ మయూర్ అశోక్





గుంటూరు, పెన్ పవర్, మే, 09, గుంటూరు నగరంలో కీలకమైన లక్ష్మీపురం మెయిన్ రోడ్ మేజర్ డ్రైన్ నిర్మాణ పనులు 4 రోజుల్లో పూర్తి చేయాలని, గత 2 నెలలుగా డ్రైన్ పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంపై కాంట్రాక్టర్ కి నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఎస్ఈ ని ఆదేశించారు. శనివారం లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ ల్లోని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పర్యటించి, పెండింగ్ పనుల వేగవంతంపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత లక్ష్మీపురం మెయిన్ రోడ్ మేజర్ డ్రైన్ నిర్మాణం, బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్ విస్తరణ పనులు జాప్యంపై ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిర్మాణ పనులు పొందిన కాంట్రాక్టర్ కి నోటీసులు ఇచ్చి తదుపరి చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్ డ్రైన్ పనులకు అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు సంబంధించిన పెండింగ్ పనులను సోమవారంలోపు చేయాలన్నారు. నిర్మాణ పనులు జరిగే సమయంలో సంబందిత ఎమినిటి కార్యదర్శులు అక్కడే ఉండాలని, లేకుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అనంతరం బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్ విస్తరణ పనులను పరిశీలించి, విస్తరణకు అంగీకారం తెలిపిన వారు, కోర్ట్ కేసుల వివరాలు అడిగి తెలుసుకొని, క్లియర్ గా ఉన్న రీచ్ లను ఇంజినీరింగ్ అధికారులకు మార్కింగ్ ఇస్తే డ్రైన్ నిర్మాణ పనులు చేపడతారని సిటి ప్లానర్ కి తెలిపారు. విస్తరణకు అడ్డుగా ఉన్న ట్రాన్స్ఫారాల షిఫ్టింగ్ కు డిడిలు కూడా ఇచ్చినందున విద్యుత్ శాఖ అధికారులు 2 రోజుల్లో షిఫ్ట్ చేయాలని ఆదేశించారు. కోర్ట్ కేసులు, అంగీకారం ఇవ్వని భవన యజమానులతో రోడ్ విస్తరణ ప్రాధాన్యతని వివరించాలని ఏసిపిని ఆదేశించారు. పనుల వేగవంతంపై నిర్లక్ష్యవైఖరి వీడి, క్షేత్ర స్థాయిలో నిర్దేశిత గడువులోగా ప్రజలకు ఇబ్బందులు రాకుండా వేగంగా జరిగేలా చర్యలు తీసుకోకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఏసిపి రెహ్మాన్, ఈఈలు వేణు, కళ్యాణరావు, డిఈఈలు వెంకటరమణ, సతీష్ కుమార్, విద్యుత్ శాఖ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సింగపూర్ మోడల్‌తో రాష్ట్ర పాలన 90 రోజుల యాక్షన్ ప్లాన్ కి శ్రీకారం

## నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట, పెన్ పవర్ మే 09: సింగపూర్ మోడల్ లో రాష్ట్ర పాలనను మార్చనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పాలనలో సంస్కరణలు, అభివృద్ధి, పారిశ్రామికీకరణను వేగవంతం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన 90 రోజుల యాక్షన్ ప్లాన్ కీలకమని అన్నారు. సింగపూర్ పాలనా విధానాన్ని ఒక జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారని తెలిపారు. 90 రోజులలోపు చర్యా ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేయాలని, నేను కాదు మనం అనే మనస్తత్వంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారని ఆయన వివరించారు. ఈ ప్రణాళిక వలన పాలనలో పారదర్శకత, వేగం, ప్రజల నమ్మకం పెరుగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 2014-19 మధ్యలో చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గణనీయంగా మెరుగుపడిందని అన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత జీఎస్డీపీని రూ.17.62 లక్షల కోట్లకు చేర్చి 10.75% వృద్ధి రేటు సాధించామని అన్నారు. అదే విధంగా 2026-27 నాటికి రూ.20.35 లక్షల కోట్ల లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో దేశంలోనే టాప్ ర్యాంకుల్లో ఉండేందుకు పారిశ్రామిక నిబంధనలను 100కు తగ్గించి లైసెన్సుల సంఖ్యను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేసామన్నారు. పారిశ్రామిక అనుమతుల సమయాన్ని తగ్గించనున్నట్లు ఆయన తెలిపారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గంగ జాతరలో అపశృతి – – రూ.15 వేల ఆస్తి నష్టం



పలమనేరు (చిత్తూరు) : పెన్ పవర్, మే, 09. గంగ జాతరలో అపశృతి చోటుచేసుకొని రూ.15 వేల ఆస్తి నష్టం సంభవించిన ఘటన శనివారం చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగింది. గంగ జాతరలో భాగంగా శనివారం ఉదయం 10:30 గంటలకు మేదర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ గుడికి ఊరేగింపుగా వెళ్లారు. ఈశ్వరుని గుడి వద్ద టపాకాయలు పేల్చగా నిప్పురవ్వలు పూలు, కూరగాయల అంగళ్లపై పడటంతో అగ్నిప్రమాదం సంభవించినది. వెంటనే స్థానికులు నీటితో అగ్నిప్రమాదమును నివారించగలిగారు. కాబట్టి టపాకాయలు పేల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని అధికారులు సూచించారు.

# ఎస్ ఎస్ సి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

జగ్గయ్యపేట పలనాడు జ్యోతిమార్చి 2026 పదవ తరగతి ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు మార్చిలో జరిగిన పరీక్షల్లో పదో తరగతిలో వివిధ సబ్జెక్టు లలో ఫెయిల్ అయిన విద్యార్థులకు మరల ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించి ఈ నెల చివరలో జరగబోయే పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయుచున్నాము. ఈ విధంగా జగ్గయ్యపేట మండలంలోని 164 మంది విద్యార్థులను సంసిద్ధులు చేయుచున్నాము. ఈ ప్రత్యేక క్లాసులను ఈరోజు ఎల్ చిట్టిబాబు ఎంఈఓ జగ్గయ్యపేట వారు తనిఖీ చేయడం అయినది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిరోజు ప్రతి క్లాస్ సబ్జెక్ట్ టీచర్ తప్పక హాజరై విద్యార్థులకు శిక్షణ ఇవ్వవలెను అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట బాయ్స్ హై స్కూల్ హెచ్ఎం నాగేశ్వరావు,గర్ల్స్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయని హేమమాధవి మరియు సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రతిరోజు పాల్గొంటున్నారు.

# ఆవో ఉర్దూ సికో కార్యక్రమం ప్రారంభం సమ్మర్ క్యాంపు ద్వారా ఉర్దూ వ్యాప్తికి పటిష్ట చర్యలు...ఎమ్మెల్యే నసీర్..





గుంటూరు, పెన్ పవర్, మే, 09, ఉర్దూ భాషను నేర్చుకోవాలనుకునే విద్యార్థులు, యువతలో ఆసక్తి పెంచేందుకు "ఆవో ఉర్దూ సిఖో" కార్యక్రమం చేపట్టినట్లు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీస్ చైర్మన్ నసీర్ అన్నారు. అందులో భాగంగా శనివారం స్థానిక పాత గుంటూరు జామియా మిస్బా హుల్ హుదా నందు పుస్తకాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ భాష అభివృద్ధికి ప్రభుత్వం ఉర్దూ సాంస్కృతిక కార్యక్రమాలు, భాషా శిక్షణ శిబిరాలు, ఉర్దూ అకాడమీ కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఉర్దూ భాషాభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. దీని ద్వారా ఉర్దూ అక్షరాల బోధన, మాట్లాడే విధానం, ఉర్దూ కవిత్వం, సాహిత్య పరిచయం, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. మదరసాలో విద్యార్థులకు సైతం సమ్మర్ క్యాంప్ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్రం నుంచి ప్రధాన మంత్రి జనవికాస్ యోజన పథకానికి రూ.250 కోట్లు మంజూరైతే, యూసీలు అందించకుండా, మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా నిరుపయోగం చేశారన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ సిబ్లీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చరిత్రలో ఎన్నడూలేని విధంగా లిటరీ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

దీని కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉర్దూ భాషాభివృద్ధికి పరోపకారిగా ఉన్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ఉర్దూకు సంబంధించి కంప్యూటర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రెండు లైబ్రరీలను ఆధునికీకరించి డీటీపీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు.

# అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి..జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ..

విజయవాడ, పెన్ పవర్, మే, 09, జిల్లాలో యువత, స్వయం సహాయక సంఘాల మహిళలు స్టార్టప్‌ల ద్వారా ఆర్థికంగా ఎదగడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పేర్కొన్నారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన వ్యాపారాలు సమర్థవంతమైన ప్రణాళిక, నాణ్యత, మార్కెటింగ్ విధానాలతో ముందుకు సాగితే పెద్ద పరిశ్రమల స్థాయికి ఎదగగలవని అన్నారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టర్ కార్యాలయంలోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్లో అర్బన్ జిల్లా సమాఖ్య, ఫౌండర్స్ రూఫ్, వివిధ స్టార్టప్ ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మహిళల భద్రత, స్మార్ట్ వెహికల్ మేనేజ్మెంట్, ప్రోటీన్ ఇన్ఫ్యూజ్డ్ కాఫీ, డిహైడ్రేషన్, ఎకో ఫ్రెండ్లీ టెక్నాలజీ.. ఇలా వివిధ భాగాల్లో స్టార్టప్ లు ప్రారంభించిన యువతతో సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని వినూత్న ఆలోచనలతో వ్యాపార రంగంలో ముందుకు సాగాలని యువతకు సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో మార్కెటింగ్ విధానాలు వేగంగా మారుతున్నాయని, సోషల్ మీడియా, ఈ-కామర్స్ వేదికలను ఉపయోగించుకోవడం ద్వారా స్థానిక ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను డిజిటల్ మార్కెటింగ్ ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లవచ్చని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణలు, ఆర్థిక సహాయం, ప్రోత్సాహక పథకాలను



వినియోగించుకుని స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయాలని సూచించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అర్బన్ సమాఖ్య ప్రెసిడెంట్ కె.మీనాక్షి, ఎస్ హెచ్ జి పారిశ్రామికవేత్తలు వాణి, మాధురి, కృష్ణవేణి, ఫౌండర్స్ రూఫ్ సారధులు విష్ణు, జగదీష్, వివిధ స్టార్టప్ ల స్థాపకులు ఉజ్వల్ బొర్రా, విఠల్, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# డప్పు కళాకారుల భారీ ప్రదర్శన జయప్రదం చేయాలి-ఎస్సీ మోర్చా..





గుంటూరు, పెన్ పవర్, మే, 09, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకల ముగింపు సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 17న పదివేల మంది డప్పు కళాకారుల ప్రదర్శన జరుగును. ఈ కార్యక్రమానికి సంబంధించి గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేద్కర్ ఆధ్వర్యంలో గోడపత్రిక ఆవిష్కరణ జరిగింది. గుంటూరు జిల్లా బిజెపి అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లా ఎస్సీ మోర్చా నాయకులందరూ డప్పు కళాకారుల ప్రదర్శన ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు వుల్లూరి గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పనతల సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారని అదేవిధంగా ముగింపు వేడుకలు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో కళాకారుల భారీ ప్రదర్శన మరియూ పి డబ్ల్యు డి గ్రౌండ్లో గల అంబేద్కర్ విగ్రహం వద్దకు ప్రదర్శన తో ర్యాలీను ప్రతి ఒక్కరు కలిసి విజయవంతం చేయాలని కోరారు. అంబేద్కర్ పేరిట ఉత్సవాలు గత నెల 12 వ తేదీనుండి రాజమహేంద్రవరం కేంద్రంగా మొదటి కార్యక్రమం యువకుల్లో క్రీడస్ఫూర్తి పెంచేందుకు కబడ్డీ, వాలీ బాలు నిర్వహణ, విశాఖపట్నం కేంద్రంగా రెండో కార్యక్రమం సమరసత మారాథన్ 3కె రన్ నిర్వహణ, తిరుపతి కేంద్రంగా, కబడ్డీ, వాలీ బాల్, విజయవంతం గా నిర్వహించము.అలానే ఈనెల రెండున కడప వేదికగా అక్కడి సాంప్రదాయ కలలు అయినా చెక్క భజన, కోలాటం భారీ ఎత్తున రెండు రోజులపాటు నిర్వహించి విజయవంతం చేయటం జరిగిందని గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, జోనల్ ఇన్చార్జి మేకల లక్ష్మణ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు రాయపూడి యేసు బాబు, అబ్రహం, జిల్లా ఉపాధ్యక్షుడు కొలికపూడి మల్లికార్జున, కార్యదర్శులు కొండపోగు మహా లక్ష్మయ్య, నులక యేసు రత్నం, ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా హ్యూమన్ రైట్స్ సంస్థ వ్యవస్థాపకుడు కొమ్మోజు.రమేష్ జన్మదిన వేడుకలు...





నాయుడుపేట, పెన్ పవర్, మే 9 నాయుడుపేట పట్టణంలో శనివారం తిరుపతి జిల్లా ఫోరం ఫర్ ఆర్.టి.ఐ అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలు, అండ్ ఫోరం ఉమన్ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి అయిన డాక్టర్!మీంజూరు.చంద్రకళ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో కలిసి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఫోరం ఫర్ ఆర్.టి.ఐ అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ జాతీయ చైర్మన్ కొమ్మోజు.రమేష్ బర్తడే వేడుకలను ఘనంగా నిర్వహించారు, కేక్ కట్ చేసి అందరికీ స్వీట్స్ పంచి పెట్టారు, అనంతరం మేరీ వృద్ధాశ్రమం నందు వృద్ధులకు దుప్పట్లును పంచి పెట్టారు, వృద్ధుల మధ్యలో ఆయన పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండలాధ్యక్షులు తొప్పాని. రవికుమార్, ఉపాధ్యక్షులు మైలారి. ముత్యాలయ్య, సెక్రెటరీ గోను. శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీ చింతకాయల.మురళి, ట్రెజరీ ఎస్.కె షాహిదా లీగల్ అడ్వైజర్ ప్రముఖ న్యాయవాది ఎం.సౌమ్య, సభ్యులు తుపాకుల.అర్జునయ్య ఎంబెటి. వెంకటరమణయ్య చిట్టేటి. సుధాకర్ వై.రామయ్య జి. శిఖామణి షేక్. మస్తాన్ షేక్.ఫైరాజ్ కె.మణెమ్మ ఐ.శిరీష తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు పట్టాల జారీపై వినతులు సమర్పించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి..





గుంటూరు, పెన్ పవర్, మే, 09, గుంటూరు వడ్డెర గూడెం, సుగాలీ కాలనీలలో ఆలయ భూములను క్రమబద్ధీకరణ చేసి పేద కుటుంబాలకు పట్టాల జారీ చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరారు. శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆధ్యాత్మిక, సామాజిక మరియు పేద ప్రజల భూసంబంధిత సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతిపత్రాలను సమర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. గుంటూరు వడ్డెరగూడెంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి నగర సంఘానికి చెందిన సుమారు 120 వడ్డెర కుటుంబాలు దాదాపు 100 సంవత్సరాలకు పైగా ఆలయ భూమిలో నివసిస్తున్నప్పటికీ ఇప్పటికీ భూముల క్రమబద్ధీకరణ జరగక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 1970లో ఏర్పాటు చేసిన పునఃపరిశీలనా కమిటీ నిర్ణయాల ప్రకారం నివాసితులు భూమి విలువ చెల్లించినప్పటికీ, వివిధ సాంకేతిక కారణాల వల్ల ప్రక్రియ పూర్తి కాలేదని తెలిపారు. అనంతరం ఎండోమెంట్స్ కమిషనర్ ఆదేశాలు, హైకోర్టు ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాలు వచ్చినప్పటికీ ఇంకా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఈ కుటుంబాలకు వీలైనంత త్వరగా పట్టాలు జారీ చేసి న్యాయం చేయాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. అదేవిధంగా సుగలి కాలనీ, లంబాడీ వర్గాలకు చెందిన అర్హులైన కుటుంబాలకు గృహ ధృవపత్రాలు మరియు ఇంటి స్థల పట్టాల జారీ విషయాన్ని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2001 సంవత్సరం నుండి అక్కడ నివసిస్తూ పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, చాలా మంది ఇప్పటికీ అధికారిక ధృవపత్రాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 2010లో 56 మంది లబ్ధిదారులకు గృహ ధృవీకరణ పత్రాలు జారీ చేసినప్పటికీ, మరో 46 మంది అర్హులైన కుటుంబాలు ఇంకా పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రుణాలు, గృహ ప్రయోజనాలు పొందలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యలను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సానుకూలంగా స్వీకరించి, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ క్షేత్రం, బుచ్చిరెడ్డిపాలెం మండలం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీవార్ల బ్రహ్మోత్సవములు సందర్భముగా

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మే 9. మూడవ రోజు శనివారం ఉదయం తిరుచా ఉత్సవం పై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. కీర్తిశేషులు శ్రీశైలం శ్రీనివాసులు కుమారులు, జొన్నవాడ వారు ఉభయకర్త లుగా వ్యవహరించారు. రాత్రి శేష వాహనం పై శ్రీ స్వామి అమ్మవార్లు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. నెల్లూరు వాస్తవ్యులు కీర్తిశేషులు వేనకూరు ఆదిశేషారెడ్డి కుమారుడు శ్రీ ఎం రమణారెడ్డి వారి కుటుంబ సభ్యులు ఉభయకర్త లుగా వ్యవహరించారు. సర్ప దోష ప్రభావ నివారణ నిమిత్తం నాగదోషం ఉన్నటువంటి వారు ఈ శేష వాహనం పై శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకొనిన యెడల సర్వ దోషాల నుండి విముక్తులు అవుతారని భక్తుల నమ్మకం. శేష వాహన సేవ సందర్భంగా భక్తుల కాలక్షేపం కొరకు ఏర్పాటు చేసిన కోలాటం, కూచిపూడి నృత్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ



కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పాలక మండలి సభ్యులు నక్కల శివ కృష్ణ జొన్నలగడ్డ వరలక్ష్మి పాలూరు చాముండేశ్వరి సూరాయపాలెం ప్రత్యూష కీలుకుప్ప శ్రీనివాసులు రామాయణం సుధారాణి, ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు, మజ్జిగ చలివేంద్రం, ఉచిత ప్రసాద వితరణ, పందిర్లు, అన్నప్రసాదం, దర్శన క్యూ లైన్ తదితర ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.తిరుమూరు అశోక్ రెడ్డిచైర్మన్ మరియు ధర్మకర్త మండల సభ్యులు అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

# అఖిల భారత పరశురామ సేవా సమితి జాతీయ అధ్యక్షులుగా 5వ సారి డా. లంకా

తిరుపతి : పెన్ పవర్ మే 09 అఖిల భారత పరశురామ సేవా సమితి జాతీయ అధ్యక్షులుగా 5 వ సారి కూడా డా. లంకా ప్రసన్న కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం ఒంగోలు లోని సంఘ కార్యాలయంలో సంఘ జాతీయ గౌరవ అధ్యక్షులు మరియు ఎన్నికల ప్రధాన అధికారి డా. పెట్లూరి వేంకటేశ్వర రావు పర్యవేక్షణలో జరిగిన సమావేశం, ఎన్నికల అనంతరం అయన ఒక ప్రకటనలో తెలిపారు. గత 4 పర్యాయాలుగా ఏకగ్రీవంగా జాతీయ కమిటీ ఎంపికవటం సంతోషమన్నారు. ఈ సంవత్సరం నీవుంచి కొత్త విధానాలతో, మరిన్ని ప్రణాళికలతో సంఘం బలోపేతం చేస్తామని అయన తెలిపారు. అనంతరం జాతీయ అధ్యక్షులు లంకా మాట్లాడుతూ తనపై ఉంచిన ఈ నమ్మకాన్ని నిలబెట్టుకొని, సంఘ బలోపేతానికి, బ్రాహ్మణుల ఐక్యతకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సంఘ వివిధ రాష్ట్రాల అధ్యక్షుల పేర్లను డా.లంకా, డా.పెట్లూరి తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా బొమ్మరాజు మారుతీ భాస్కర్ శర్మ, జాతీయ కోశాధికారిగా బొమ్మరాజు చలపతిరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా డా. ముదివర్తి వేంకట పవన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా మల్లాది వెంకట నాగ ప్రసాద్, కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులుగా మాదిరాజు శేష సాయి లను ఎంపిక చేసినట్టు తెలిపారు. సంఘ పదవీకాలం 2 సంవత్సరాలు ఉంటుందని నూతన బాధ్యులు సంఘ ఐక్యతకు కృషి చేయాలనీ వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# అక్రమ సంబంధం బయట పడుతుందని అత్తను తన తల్లితో కలిసి హతమార్చిన కోడలు





దగదర్తి పెన్ పవర్ మే 09 అక్రమ సంబంధం బయటపడుతుందని అత్త ను తల్లితో కలిసి గొంతు నులిమి హతమార్చిన ఘటన దగదర్తి మండలం సున్నపుబట్టీ లో శనివారం చోటుచేసుకుంది. హత్య జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కుటుంబ సభ్యులను విచారించారు. విచారించిన అనంతరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు సున్నపుబట్టి కూడలి లో మైపాటి మాధవి (45) కోడలు పద్మశ్రీ టిఫిన్ సెంటర్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. కొడుకు పవన్ కుమార్ ఎలక్ట్రీషియన్ గా కూలి పనులకు వెళ్తుంటాడు. పద్మశ్రీ కి వేరే వ్యక్తి తో ఉన్న అక్రమ సంబంధం అత్తకు తెలిసిపోయిందని ఎలాగైనా ఆమెను లేకుండా చేయాలని తన తల్లితో ప్రణాళిక రూపొందించింది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి తన భర్త పవన్ కుమార్ కు నిద్ర మాత్రలు వేసి నిద్రలో ఉండగా తన తల్లి పుచ్చలపల్లి మాధవి తో కలిసి గొంతు నలిమి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. డిఎస్పి రమణ కుమార్, సీఐ శివశంకర్, ఎస్సై జంపాని కుమార్ లు సంఘటనా స్థలాన్ని కలిసి పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి శరీరంపై గాయాలు ఉన్నాయని హత్య జరిగిన తీరుపై మరింత లోతుగా విచారణ చేపడితే పూర్తి నిజా నిజాలు తెలిసే అవకాశం ఉందని బంధువులు కోరుతున్నారు. కేసు నమోదు చేసి నిందితులను ఇంకా పూర్తి విచారణ చేస్తున్నామని హత్యలో పాల్గొన్న వారిని కఠినంగా శిక్షించేలా చూస్తామని పోలీసులు తెలిపారు.

# రైతు సంక్షేమం కు మరో మలుపు డ్రోన్ సేవలపై బీదా, కాకర్ల,కావ్య..

కావలి, పెన్ పవర్ మే 09 కావలి పరిసర ప్రాంత రైతులకు వ్యవసాయ డ్రోన్ సేవలు అందుబాటులో కి రావడం రైతు సంక్షేమం లో నూతన మలుపుగా రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు క్రిష్ణా రెడ్డి, కాకర్ల సురేష్ లు పేర్కొన్నారు.?తేజస్విని డ్రోన్ టెక్ మరియు సైఫెరో సిండికేట్ టెక్ సొల్యూషన్స్ ద్వార కాంద్ర సతీష్ ముసునూరు లో ఏర్పాటు చేసిన డ్రాన్ సేవా కేంద్రం ను వారు ప్రారంభించారు.పెరుగుతున్న ఆధునిక సాంకేతికతను రైతు సంక్షేమం కు వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్న క్రమంలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ సతీష్ డ్రాన్ వ్యవస్థ ను జిల్లాలో తొలి సారిగా కావలి లో ఏర్పాటు చేయడం పట్ల మస్తాన్ రావు, క్రిష్ణా రెడ్డి, సురేష్ లు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సతీష్, సైఫెరో సిండికేట్ టెక్ మేనేజర్ వరదరాజన్ లు మాట్లాడుతూ? తమ వద్ద వివిధ రకాల వ్యవసాయ డ్రోన్లు లభిస్తాయి: 6 డ్రోన్లు: 10 లీటర్ల సామర్థ్యం,?8 డ్రోన్లు 20 లీటర్ల సామర్థ్యం.తో లభిస్తాయని తెలిపారు. 30 లీటర్ల వరకు గరిష్ట సామర్థ్యం గల డ్రోన్ లు 30 కేజీల యూరియా చల్లగల డ్రోన్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.?అన్ని రకాల వ్యవసాయ డ్రోన్లకు సర్వీస్, రిపేర్ మెయింటెనెన్స్ సౌకర్యం ఉందని.వ్యవసాయ డ్రోన్లకు సంబంధించిన అన్ని రకాల విడిభాగాలు లభిస్తాయని. బ్యాటరీ రిపేర్: డ్రోన్



బ్యాటరీలకు సంబంధించిన రిపేర్ పనులకు తాము హామీ అని తెలిపారు వ్యవసాయ డ్రోన్లకు సంబంధించి రైతులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి వింజమూరు దేశం నేత వనిపెంట సుబ్బారెడ్డి, మాజీ జడ్ పి టి సి దామా మహేష్ , ముసునూరు శ్రీ హరి నాయుడు కావలి,ఉదయగిరి ప్రాంతాలక పలు రాజకీయ పార్టీల రైతు నేతలు, రైతులు , పాల్గొన్నారు.

# జగన్‌కు విలువలు, విశ్వసనీయత లేవు.. కూటమి తోనే ఏపీ అభివృద్ధి: మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి



నెల్లూరు పెన్ పవర్ మే 09 "వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత లేవు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఆయన తగ్గ తనయుడు కాదు" అని ఉదయగిరి మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు మహానాడుతో నెల్లూరుకు చారిత్రక అవకాశం తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పసుపు పండుగ 'మహానాడు' ఈసారి నెల్లూరు జిల్లాలో జరగడం గర్వకారణమని మేకపాటి పేర్కొన్నారు.

తేదీలు: మే 27, 28, 29 తేదీల్లో కొడవలూరు మండలం ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాంగణంలో ఈ వేడుక జరగనుంది.

సమిష్టి కృషి: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మరియు కూటమి నేతలందరం కలిసి 'శభాష్ నెల్లూరు' అనేలా మహానాడును విజయవంతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కాకాణిపై విమర్శల వర్షం.. "నువ్వు నెల్లూరు వేణు స్వామివి"

వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి తీరుపై మేకపాటి ఘాటుగా స్పందించారు:

చిలక జోస్యం: "2024లో నెల్లూరులో 10కి 10 సీట్లు గెలుస్తామని జోస్యం చెప్పావు.. ఏమైంది? అప్పుడు జగన్ పక్కన వేణు స్వామి, ఇక్కడ నువ్వు చెప్పిన జోస్యాలు ఫలించలేదు. ఇప్పుడు మళ్ళీ 2029 గురించి మాట్లాడుతున్నావు. వచ్చే ఎన్నికల్లోనూ పదికి పది సీట్లు గెలిచేది కూటమి ప్రభుత్వమే.. ఇది శేఖర్ రెడ్డి చెబుతున్న జోస్యం" అని ఎద్దేవా చేశారు.

వ్యక్తిగత విమర్శలు వద్దు: సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై బాడీ షేమింగ్ వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, రాజకీయంలో కావాల్సింది సేవ కానీ లావు, సన్నం కాదని హితవు పలికారు. మర్యాద లేకుండా మాట్లాడితే తాము కూడా అదే స్థాయిలో స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు.అధికార గర్వం: జగన్ తనను తాను ఒక రాజుగా భావించి పాలన సాగించారని, పార్టీ కోసం త్యాగం చేసిన వారిని కూడా గౌరవించలేదని విమర్శించారు. సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయ రెడ్డి వంటి వారి మాటలు విని 'గ్రాఫ్ బాగాలేదు' అని తనను పక్కన పెట్టారని, తీరా ప్రజలు ఎవరి గ్రాఫ్ ఎలా ఉందో ఎన్నికల్లో తేల్చేశారని గుర్తు చేశారు. కూటమి పాలన: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, లోకేష్ బాబు కష్టం, పవన్ కళ్యాణ్ సహకారం మరియు కేంద్రంలోని బీజేపీ మద్దతుతో రాష్ట్రం మళ్ళీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నేతలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ సీపీ శ్రేణులపై దెబ్బ పడితే నా మీద పడినట్టే కాకాణి

నెల్లూరు రూరల్ పెన్ పవర్ మే 09 మే 09 శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలం, నావూరు పల్లి కి చెందిన వైఎస్ఆర్ సీపీ పొదలకూరు ఎస్సై హనీఫ్ చేయి చేసుకోవడం తో పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుడు హరికృష్ణ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి రెడ్డి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలపై ఎస్ ఐ హనీఫ్ బెదిరింపులకు పాల్పడుతూ, స్టేషన్ కి పిలిచి దుర్మార్గంగా కొడుతున్నాడుకొట్టే దృశ్యాలను టీడీపీ నేతలకు విడియో కాల్ చేసి చూపించాడు పొలానికి మోటార్ సర్వీస్ కనెక్షన్ కోసం వైఎస్ఆర్ సీపీ నేత హరి ఎలక్ట్రికల్ ఏఈ ని ప్రశ్నిస్తే.. హరిని పిలిచి ఎస్ ఐ అకారణంగా కొట్టాడు పొలానికి మోటర్ కనెక్షన్ కోసం పొదలకూరు ఎలక్ట్రికల్ ఏఈ 40 వేలు లంచం తీసుకుని పనిచేయకపోవడం వల్లనే హరి ప్రశ్నించాడు ఎస్ ఐ హనీఫ్ మీద అనేక ఆరోపణలు ఉన్నాయ్,అతన్ని వెంటనే సస్పెండ్ చెయ్యాలి ధర్నాలు చేస్తే నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని ఎస్ ఐ బెదిరిస్తాడా కూటమి పాలన లో వైయస్ఆర్ సీపీ శ్రేణుల మీద అక్రమ కేసులు దాడులు దౌర్జన్యాలు ఎక్కువైపోయాయి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ఆర్ సీపీ శ్రేణులను అకారణంగా ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై చర్యలు తీసుకుంటాం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై పోలీసులు వరుసగా దాడులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు నావూరుపల్లి గ్రామానికి చెందిన పార్టీ ముఖ్య నాయకుడు హరిని స్టేషన్‌కు పిలిపించి, ఎస్ఐ హనీఫ్ విచక్షణారహితంగా కొట్టి హింసించాడు

హరిని స్టేషన్‌కు పిలిపించి కొట్టడమే కాకుండా, తెలుగుదేశం పార్టీ నాయకులకు వీడియో కాల్ చేసి మరీ ఆ దృశ్యాలను చూపించడం అత్యంత దారుణం అధికార పార్టీ నాయకుల మెప్పు కోసమే పోలీసులు ఇలాంటి అరాచకాలకు పాల్పడుతున్నారు డీఎస్పీ ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి,ఎస్ ఐ పై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.డీఎస్పీ హామీ మేరకు ప్రస్తుతానికి నిరసన విరమిస్తున్నాం , పోలీసు వ్యవస్థపై నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం బాధిత కార్యకర్తకు న్యాయం జరగని పక్షంలో మా పోరాటం కొనసాగుతుంది, భవిష్యత్తులో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం ఇద్దరు రైతులు అగ్రికల్చర్ విద్యుత్ కనెక్షన్ కోసం ఎలక్ట్రిసిటీ ఏఈని సంప్రదించగా, ఆయన వారి వద్ద నుంచి 40,000 లంచం తీసుకున్నాడు లంచం



తీసుకున్న తర్వాత పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేశాడు , అయితే స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు జోక్యం చేసుకుని "మాకు తెలియకుండా కనెక్షన్ ఎలా ఇస్తారు?" అని అధికారులను ప్రశ్నించడంతో విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా ఆపివేశాడు ప్రస్తుతం విద్యుత్ శాఖలో ఏఈలు డబ్బులు తీసుకున్నా, కేవలం తెలుగుదేశం పార్టీ వారు చెబితేనే కనెక్షన్లు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలకు న్యాయం జరుగుతుంది మా ప్రాణాలు పోయినా, పంటలు ఎండిపోయినా సరే.. తెలుగుదేశం పార్టీ వారి వద్దకు వెళ్లి కనెక్షన్ కోసం దేబిరించాల్సిన అవసరం మాకు లేదు" అని కార్యకర్త హరి కృష్ణ స్పష్టం చేశాడు ప్రభుత్వం మరియు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు , వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి పని పూర్తి కాకపోవడంతో హరికృష్ణ వద్ద ఏ ఈ లంచంగా తీసుకున్న 40 వేల రూపాయలు వెనక్కి ఇవ్వాలని అడిగిగాడు డబ్బులు వెనక్కి ఇమ్మన్నందుకు ఏఈ దుర్భాషలాడటమే కాకుండా, తెలుగుదేశం పార్టీ నాయకులకు సమాచారం ఇచ్చి వారి ఒత్తిడితోనే పోలీసులు రంగ ప్రవేశం చేసి హరికృష్ణ ను అకారణంగా కొట్టారు

ఏఈ ఎటువంటి ఫిర్యాదు ఇవ్వకపోయినా, ఎస్ఐ హరికృష్ణపై చేయి చేసుకోవడం దారుణం

బీసీ , యాదవ వర్గానికి చెందిన హరికృష్ణను కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారు పోలీసులు, ఎలక్ట్రిసిటీ అధికారులు, ఇతర శాఖల సిబ్బంది, కూటమి నేతలకు తలొగ్గి పనిచేస్తున్నారు, ఇదే పంథా మీరు కొనసాగిస్తే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది

మేము అమౌంట్ ముట్ట చెప్పకపోతే మాకు సర్వేపల్లి నియోజకవర్గంలో పోస్టింగ్ వచ్చే పరిస్థితి లేదు" అని అధికారులు అంటున్నారు సోమిరెడ్డి, ఆయన కుమారుడు అధికారుల నుండి నెలమాముళ్లు తీసుకుంటున్నారు, అధికారులు లంచాలు తీసుకోకుండా పని చేయలేని పరిస్థితి కల్పిస్తున్నారు పొదలకూరు చరిత్రలో స్వర్గీయ ఏసీ సుబ్బారెడ్డి హయాం నుండి నా వరకు ఏ రోజూ లేఅవుట్ల వద్ద గానీ, ఇతర వ్యాపారుల వద్ద గానీ ఒక్క రూపాయి వసూలు చేసిన చరిత్ర మాకు లేదు సోమిరెడ్డి లేఅవుట్ల యజమానుల దగ్గర రెండున్నర కోట్ల రూపాయలు వసూలు చేశాడు . ఆ డబ్బు తీసుకోలేదని ప్రమాణం చేయగలవా ఎస్ ఐ 2029 తర్వాత నీ పరిస్థితి ఏంటో ఒకసారి ఆలోచించుకో, నీ మీద విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటాం

వైఎస్ ఆర్ సీపీ శ్రేణులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోము , అధికారుల అతిని సహించే ప్రసక్తే లేదు

ధర్నా చేస్తే నాన్-బెయిలబుల్ కేసులు పెడతామని ఎస్సై ఫోన్ చేసి బెదిరించాడు మేము ధర్నా చేశాం, దమ్ముంటే మాపై కేసులు పెట్టుకోండి.. మీ దమ్ము ఏంటో నిరూపించుకోండి

వైఎస్ఆర్ సీపీ కార్యకర్తపై చేయి వేయడం అంటే అది నాపై చేయి వేయడమే

వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలను కొట్టాలని అనుకుంటే, ముందు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నన్ను కొట్టండి.. నాపై మీ కసి తీర్చుకోండి, కానీ అమాయక కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోంకార్యకర్తలను కొట్టి, వేధిస్తూ భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే సహించేది లేదు తప్పు చేసిన అధికారులపై ప్రైవేట్ కేసులు వేస్తాం , వచ్చే రోజుల్లో తప్పనిసరిగా వారు అరెస్ట్ అయ్యేలా చూస్తాం బిరదవోలు పంచాయతీ పరిధిలోని గ్రామ పంచాయితీ భూములకు సంబంధించిన వివాదంలో ఎస్సై ఏకపక్షంగా వ్యవహరిస్తూ,అది గ్రామ పంచాయతీ భూమి అని చెప్పడానికి లేదు అని ఫోన్ చేసి గ్రామస్తులను బెదిరించి,భయభ్రాంతులకు గురి చేస్తూ తెలుగుదేశం వారికి కట్టబెట్టి ఆలోచన చేస్తున్నాడు గ్రామస్తులను "బొక్కలో వేస్తా ..నా కొడకా.."అనే అధికారం ఎస్సైకి ఎవరు ఇచ్చారు సివిల్ డిస్ప్యూట్స్ లో నీ జోక్యం ఏంటి? పొదలకూరు మండలం నీ జాగీరు అనుకుంటున్నావా అధికారులకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేసే ఏ అధికారిని వదిలిపెట్టం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా అండగా ఉండి పోరాడుతాం

# పవన్ కళ్యాణ్ తో మత్స్యకార భేటీకి గ్రీన్ సిగ్నల్...ఎమ్మెల్యే బొమ్మిడి నాయక్



కావలి పెన్ పవర్ మే 09 జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇంచార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ రోజు శ్రీకాళహస్తిలో కావలి నియోజకవర్గ మత్స్యకార నాయకులతో జనసేన పార్టీ రాష్ట్ర మత్స్యకార ఛైర్మన్ మరియు నర్సాపూర్ ఎమ్మెల్యే బొమ్మిడి నాయక్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు సమర్పించిన వినతిపత్రంలో హైస్పీడ్ పెద్ద బోట్లు ఆంధ్రప్రదేశ్ సముద్ర పరిధిలో అక్రమంగా ప్రవేశించడం వల్ల మత్స్యకారులకు జరుగుతున్న ఆస్తి నష్టం, వలలు మరియు చిన్న పడవలు ధ్వంసం కావడం వంటి సమస్యలను వివరించారు. ఈ సమస్యను జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన బొమ్మిడి నాయక్ పూర్తి వివరాలతో త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలిసి సమస్యను వివరిస్తానని, అలాగే మత్స్యకార ప్రతినిధులకు అపాయింట్‌మెంట్ కూడా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని కూడా కలిసి మత్స్యకారుల సమస్యపై చర్చిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్యదర్శి కోడింగారి శ్రీనివాసులు, దీజ ఐక్యతభవన్ అధ్యక్షులు చిన్ని వరప్రసాద్, మత్స్యకార సంఘ అధ్యక్షులు గోవింద్ పూర్తి వివరాలు వారికి అందించారు. కావలి నియోజకవర్గ మత్స్యకార అధ్యక్షుడు ప్రళయకావేరి రవి, రూరల్ మండల ఉపాధ్యక్షుడు వెంకయ్య బాబు, తుమ్మలపెంట అధ్యక్షుడు కొండూరు వెంకటేశ్వర్లు, రూరల్ మండల కార్యదర్శి చిన్నింగారి బాలు, రూరల మండల కార్యదర్శి కొండూరు వెంకటేశ్వర్లు, కావలి రూరల్ మండల ఉపాధ్యక్షుడు వాఇల వెంకయ్య బాబు, తుమ్మలపెంట పంచాయితీ ఉపాధ్యక్షుడు రాసాని ఇమాన్యూల్, డాక్టర్ దినకర తేజ,

బోగోలు మండల కార్యదర్శి కాటంగారి దినకర్ తేజ, సాలిపేట పంచాయతీ అధ్యక్షుడు సింగోని రాము, నీటిసంఘ అధ్యకుడు, రమేష్, శ్రీరాములు, రఘు ప్రళయకావేరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఎస్ సి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు





జగ్గయ్యపేట పెన్ పవర్ మే 09 మార్చి 2026 పదవ తరగతి ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు మార్చిలో జరిగిన పరీక్షల్లో పదో తరగతిలో వివిధ సబ్జెక్టు లలో ఫెయిల్ అయిన విద్యార్థులకు మరల ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించి ఈ నెల చివరలో జరగబోయే పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయుచున్నాము. ఈ విధంగా జగ్గయ్యపేట మండలంలోని 164 మంది విద్యార్థులను సంసిద్ధులు చేయుచున్నాము. ఈ ప్రత్యేక క్లాసులను ఈరోజు ఎల్ చిట్టిబాబు ఎంఈఓ జగ్గయ్యపేట వారు తనిఖీ చేయడంఅయినది. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిరోజు ప్రతి క్లాస్ సబ్జెక్ట్ టీచర్ తప్పక హాజరై విద్యార్థులకు శిక్షణ ఇవ్వవలెను అని తెలియజేశారు.